అంతర్వాహిని

హితశ్రీ

* గతసంచిక తరవాయి *

8

పరీక్షాఫలితాలు వచ్చాయి. విశ్వం అనుకున్నట్టుగానే రెండో తరగతిలో ఉత్తీర్ణుడయాడు. అతనికి ఉత్సాహంగా ఉంది. ఆ ఉత్సాహం ఎవరితోనైనా పంచుకోవాలని ఉంది: కాని తనకి అంత ఆప్తమిత్రు లెవరూ లేరు. రంగారావు ఒక్కడే తనకి కొంచెం మిత్రుడనదగినవాడు. మిగతావాళ్ళందరూ పరిచయస్థులు మాత్రమే. రంగారావైనా మరీ హృదయం పంచి ఇవ్వగల మిత్రుడు కాడు. నాటకసంఘంలో చేరిన తరవాత అతనిమీద విశ్వానికున్న సదభిప్రాయం కొంతవరకు తగింది. రిహార్సలుకి వెళ్ళినరోజు తరవాత రంగారావు ఇంటికి పనికట్టుకునివెళ్ళి తన తీవ్ర అసంతృప్తి తెలియచేశాడు. విశ్వం ధోరణికి అతను కొంచెం ఆశ్చర్యపడ్డాడు. "ఏదో తమాషాకి కబుర్లుచెప్పుకోటమే గాని ఆమెని నిజంగా అవమానించాలని ఎవరికీ లేదు." అన్నాడు. "అటువంటి తమాషాల వెనకాల బోలెడంత విషాదం ఉంది." అన్నాడు విశ్వం. తామెవ్వరూ అంతలోతుగా ఆలోచించలేదన్నాడు రంగారావు. "అటువంటి స్వభావంకలవాళ్లు కళోద్ధారకు లెప్పటికీ కాలేరు. నాటకసంఘంనించి రాజీనామా ఇస్తున్నాను" అన్నాడు విశ్వం. కాని రంగారావు నచ్చచెప్పి రాజీనామా ఇవ్వకుండా ఆపాడు. ఆ రోజునించీ విశ్వం రిహార్సల్సుకి ఇంతవరకూ వెళ్లలేదు.

ప్యాసయినట్టు పేపర్లో చూసిన తరవాత విశ్వానికి ఇంట్లో కాలునిలవలేదు. నెత్తిమీదనించి ఓ పెద్దబరువు తీసేసినట్టుంది అతనికి. స్వేచ్ఛగా బయటతిరిగి రావాలనిపించి బయల్దేరాడు. ఉత్సాహమంతా లోలోపలే అణుచుకోటం కష్టంగా ఉంది. ఆశ్చర్యం! ఇన్నేళ్లు ఎంతమందితోనో కలిసి చదివాడు. ఒక్కడూ తన హృదయానికి దగ్గరగా రాలేకపోయాడు. తిప్పి చెప్పాలంటే తను ఎవరిహృదయానికీ దగ్గరగా వెళ్లలేకపోయాడు. ఎక్కడుందో ఈ లోపం! కష్టనష్టాలలో, ఉత్సాహోద్రేకాలలో హృదయం సహవాసం కోరుతుంది. అదే తనకిప్పుడు కరువయింది.

ఆలోచిస్తూ నడుస్తున్న విశ్వం మనసులో తళుక్కున వసంత మెరిసింది. ఆమె తనకి టీపార్టీ ఇస్తానంది. తను ప్యాసయితే ఆమె కెందుకు సంతోషం! ఉదయం ఇంటిదగ్గిరే ఉండి ఉంటుంది. వెడితే! ఏమనుకుంటుందో? మాటవరసకి అని ఉంటుందేమో!

మనసులో ఏమీ నిశ్చయించుకోకుండానే విశ్వం వసంత ఇంటివైపు నడిచాడు. ఇంటి ముందాగి ఒక క్షణం తటపటాయించాడు. లోపల్నించి సన్నగా సంగీతం వినిపిస్తోంది. ఆమె ఇంట్లోనే ఉందన్నమాట! పాడుకుంటూ ఉంది. తను వెడితే ఆమె సాధనకి అడ్డొస్తాడేమో! సంకోచిస్తూ విశ్వం ఆవరణ దాటి తలుపు దగ్గిర నుంచున్నాడు. తలుపు ఓరగానే వేసి ఉంది.

"జానకీరమణ నా జతబాసి చనబోకు
మానససుమముల మనసార పూజింతు..."

మృదుమధురంగా వినిపిస్తోంది గానం.

"రహిపుట్ట జంత్రగాత్రముల రాల్గరగించు
విమల గాంధర్వంబు..."

పెద్దనగారి పద్యపాదం తలపుకొచ్చింది విశ్వానికి.

ఎంత రసానుభవంతో ఆ మాటలు అనగలిగాడో ఆయన!

"బాలపల్లవ గ్రాస కషాయకంఠకలకంఠ వధూకల కాకలీధ్వని"కి పాటలోని ఉత్తమమైన సాహిత్యం మెరుగు పెడుతోంది.

జావళీ వినిపించవలసిన ఇంట్లోంచి త్యాగరాజస్వామి కీర్తన వినిపిస్తోంది. ఆ కర్ణాటక సంగీతానికి తన్మయుడై ద్వారందగ్గిర అలాగే నిలిచిపోయాడు విశ్వం.

పాట పూర్తయింది. పాటకి ప్రతిధ్వనిలా వయొలిన్‌మీద రాగాలాపన సన్నగా వినిపిస్తోంది. విశ్వం తెగించి ధైర్యంగా లోపలికి అడుగు వేశాడు. తలుపు చప్పుడు విని వసంత తలెత్తి విశ్వాన్ని చూసి ఆశ్చర్యపడి వయొలిన్ కింద పెట్టి లేచి నుంచుని "కవిగారా!" అంది.

విశ్వం చిరునవ్వు నవ్వాడు.

"మీ పాటకి అడ్డొచ్చినట్టున్నాను."

"లేదండీ. అలా కూర్చోండి." అంది వసంత.

"ఇవాళ మా పరీక్షా ఫలితాలు వచ్చాయి. నేను సెకండ్ క్లాసులో ప్యాసయ్యాను" అన్నాడు. విశ్వం కుర్చీలో కూర్చుంటూ.

"చాలా సంతోషమండి." అంది వసంత.

"మరి మీ టీపార్టీ సంగతేమిటి?" అన్నాడు విశ్వం కొంచెం చనువు తీసుకుని".

వసంత ముఖంలో విస్మయం తాండవించింది. "ఏం టీపార్టీ?" అంది అప్రయత్నంగా.

"మర్చిపోయారన్నమాట. నేను ప్యాసైతే మీరు టీపార్టీ ఇస్తానన్నారుగా. మరి అందుకే వచ్చాను."

వసంత ముఖం ఎర్రబడ్డది. ఆమెకి తన మాట జ్ఞాపకం వచ్చింది. ముందే ఆ సంగతి తనకి జ్ఞాపకం రానందుకు ఆమెకి కించగా ఉంది. తను ఆమాట అన్నప్పుడు చాలా మనఃపూర్వకంగానే అన్నది. తన ఇప్పటి ప్రవర్తన చూసి ఏమనుకున్నారో ఆయన!

విశ్వం ఆమె ముఖ కవళికల్ని గమనించాడు. ఆమె వాగ్దానం మర్చిపోయి అందుకు సిగ్గుపడుతోందని గ్రహించాడు. తను అనవసరంగా ఆమె మనసుకి కష్టం కలిగించాడు.

"ఊరికే అన్నాలెండి. మీరు నిజమనుకునేరు. ప్యాసయినట్టు చెప్పి పోదామని వచ్చాను." అన్నాడు విశ్వం తన తప్పును సరిదిద్దుకోటానికి ప్రయత్నిస్తూ.

వసంత చిరునవ్వు తెచ్చుకుని, "నోటీసు ఇచ్చి పోవటానికి వచ్చారన్నమాట." అంది.

విశ్వం నవ్వాడు.

"ఇప్పుడే వస్తానుండండి" అని వసంత లోపలికి వెళ్ళి కొంచెం సేపట్లో కాఫీ కప్పుతో తిరిగివచ్చి బల్ల మీద పెట్టింది.

"ఇప్పటికిదే ఇచ్చుకోగలనండీ. క్షమించాలి."

విశ్వం మొహమాటపడ్డాడు. అప్పుడే బజార్లో తాగివస్తున్నానన్నాడు. ఆమె బలవంతం చేసింది. మరేమీ అనకుండా కాఫీ తాగేశాడు అతను.

"మీరు చాలా మంచివారండీ ఏదో అన్నానని అనుకోకుండా జ్ఞాపకం ఉంచుకుని వచ్చారు."

'మరి ఊరికే వచ్చేవాటిని వదులుకోమంటారా?'

వసంత చిరునవ్వు నవ్వింది.

"మీరు రిహార్సల్సుకి రావటం లేదేమండీ? రోజూ చూస్తున్నాను."

"నాకోసమా?"

"అవును"

"ఎందుకూ?"

వసంత తెల్లబోయింది. అతనలా అడుగుతాడని ఆమె అనుకోలేదు. ఒక క్షణం అతని ముఖంలోకి చూసి అంది.

"కవిగారు కదూ? హావభావాలు ఎలా ఉండాలో సలహా ఇస్తారని."

తన అనాలోచితమైన ప్రశ్నకి ఆమె ఇచ్చిన సమాధానం విశ్వానికి నచ్చింది.

"నాకు నటనగురించి ఏమీ తెలియదు."

"తెలియకుండానే మెచ్చుకున్నారన్నమాట"

విశ్వానికి ఏమనటానికీ తోచలేదు. ఆలోచించి అన్నాడు.

"మెచ్చుకోటానికి శాస్త్ర విషయాలు తెలియాలా?"

"మెచ్చుకోదలచుకుంటే చాలు."

సంభాషణలోని ఆచుకుదనానికి విశ్వం ఆమెని మనసులోనే పొగిడాడు.

"పోన్లెండి మీకేమీ రాదంటాను. సరా?"

ఆమె సమాధానం చెప్పకుండా చిన్నగా నవ్వి ఊరుకుంది.

"ఇంతకీ మీరు రిహార్సల్సుకి ఎందుకు రావటం లేదో చెప్పనే లేదు."

"నాకిష్టం లేదు."

"ఏం?"

"ఆ వాతావరణం నాకు సరిపడదు."

"వాళ్లు మీ నాటకం పాడుచేస్తుంటే చూస్తూ ఊరుకుంటారా?"

"పాడు చేస్తున్నారా?"

"ఆ డైరెక్షన్ నాకు నచ్చదు."

"అయినా సలహాలివ్వటానికి నాటకాల విషయంలో నాకు అనుభవ మేమీ లేదు."

"ఆలోచన ఉంటే చాలు. వాళ్లు ఎంతసేపటికీ ప్రజల అభిరుచుల్ని గురించే మాట్లాడుతారు. అలా ఉంటేగాని ప్రేక్షకులు మెచ్చరు అంటారు. సహజ నటనకి ఆస్కారమివ్వరు. ఇవన్నీ వాళ్లమీద ఫిర్యాదులుగా చెప్పటం లేదు. నా మనసుకి తోచినవి మీకు చెబుతున్నాను. అదీ మీరు కవిగారు కనుక, రిహార్సల్స్‌కి రావటం లేదు కనుక చెబుతున్నాను."

"నా నాటకం పాడయితే మీకేం నష్టం?".

వసంత అతనివైపు ఆలోచనగా చూసింది.

"అంటే మీకు అందులో ఉత్సాహ మేం లేదా?"

"లేదు."

"అయినా నాటకం పాడయితే మీకు చెడ్డ పేరు వస్తుంది."

"నా కంతకుముందు మంచి పేరుంటేగా!" అన్నాడు విశ్వం నవ్వుతూ.

"సామాన్యంగా అందరూ మీకు మల్లే ఉండరు".

"మనుషుల రూపాలన్నీ ఒక్కమాదిరిగా ఉండనట్టే భావాలూనూ"

"నాటకం చెడిపోతే నాటక సంఘానికి పేరు ప్రతిష్ఠలేం ఉంటాయి?"

"పోనివ్వండి పాడుసంఘం."

"మీరుకూడా అందులో సభ్యులేకదూ?"

"సభ్యుడినే కావొచ్చు. కాని దాంట్లో నాకు అభిరుచి లేదు. అదీకాక అందులోని వ్యక్తులంటే నాకు సరిపడదు. వాళ్ళకి కావలసింది నాటకకళ కాదు. తైతక్కలాడి ఏదో పేరు తెచ్చుకోటం. హడావిడి చెయ్యటం. అవాకులూ చెవాకులూ వాగటం. కొత్తఅందమైన నటి కనిపిస్తే ఆమెచుట్టూ తిరగటం. నిరాశ చెందితే నోటికొచ్చినట్టు వాగటం. వీళ్ళకి నాటకాలూ, సంఘాలూ ఎందుకు?"

వసంత అంతా విని విశ్వం ముఖంవైపు చూసింది. విసుగుదల, నిస్సహాయభావం, కోపం అతని వదనంలో ప్రతిబింబిస్తున్నాయి.

"మీరు చెప్పింది నిజమే. కాని వ్యక్తుల లోపాలు సంఘానికి వర్తింపచెయ్యటం ఎందుకు? "

"వాళ్లు స్థాపించిందే ఆ సంఘం."

"పెద్దలైన వాళ్లు వెనకాల ఉన్నారుగా. మీ లాంటి వాళ్లు కలగచేసుకొని బాగు చెయ్యటానికి ప్రయత్నించాలిగాని కోపగించుకుని వొదలేస్తే ఎలా?"

ఆమె మాటల్లో నిజం ఉందని ఒప్పుకున్నాడు విశ్వం.

"ఈ సారి రిహార్సలుకు వస్తారా?"

"వీలయితే!" ఇంకా నవ్వుతూనే అన్నాడు.

"మీరు వస్తే నాకు ధైర్యంగా ఉంటుంది."

"ధైర్యమా! అంటే?" అన్నాడు అర్థం కాక.

"ఆనరేశ్వరరావూ, డైరెక్టరూ ఉన్నారే, వాళ్ల ప్రవర్తన నాకు నచ్చదండి."

కొంచెంసేపు మౌనంగా ఉండి అన్నాడు విశ్వం. "పోనీ, నాటకంలో వెయ్యటం మానెయ్యరాదూ?"

"ఎలా?" అంది వసంత నిస్సహాయంగా.

"బలవంతమేముంది. మీరేం డబ్బు తీసుకోటం లేదుగా"

"నిజమే. కాని నా భవిష్యత్తుసంగతేమిటి?"

"ఈ నాటకంతోనే ఉందా మీ భవిష్యత్తంతా?"

"ఈ సంస్థకి పెద్దల సహకారం ఉంది. ఈ నాటకంలో బాగా వేస్తే నటన జీవనోపాధిగా చేసుకుందామని ఉంది. అవకాశం కూడా దొరకవచ్చు. నాకు పెద్దచదువు లేదు. ఇంట్లో తింటూ కూర్చోటానికి డబ్బు లేదు. మరి ఇంక నేనేం చెయ్యగలను?"

"పెళ్లి చేసుకోండి" అన్నాడు విశ్వం హాస్యానికి అన్నట్టుగా. వసంత మాటాడలేదు. సిగ్గుపడ్డదేమోననుకున్నాడు విశ్వం. ఆ మాట కొంతవరకు వాస్తవమే కాని ఆ సమయంలో ఆమె ముఖంలో సిగ్గుకంటే ఏదో వేదన ప్రముఖంగా కంపించిందతనికి. వసంత ఎంతసేపటికీ మారుమాట్లడక పోవటం అతనికి అను

మానం కలిగించింది. తనమాటలు ఆమెని తప్పక గాయపరచి ఉంటాయి. తెలివి తక్కువగా మాట్లాడాడు. ఆమెకి ఏదో సలహా ఇచ్చినట్టు ఘనంగా అన్నాడు. అందులో కొంత హాస్యధోరణి ఉన్నా ఆ అమూల్యమైన సలహా ఇవ్వటానికి తనే కావాలా ?

"ఏమనుకోకండి. తమాషాకి అన్నాను," అన్నాడు విశ్వం ఊరడిస్తున్నట్టు.

వసంత ఓ నవ్వు పెదవులమీదికి తెచ్చుకొంది. కొద్దిక్షణాలు మళ్ళీ నిశ్శబ్దంగా గడిచాయి.

"మరి నేను వెళ్ళొస్తా" అన్నాడు విశ్వం, కుర్చీలోంచి లేచి నుంచుని.

"మా ఇంట్లో విందుచేస్తే వస్తారా?" అంది వసంత.

"విందా!" ఆశ్చర్యంగా ఆమె ముఖంలోకి చూశాడతను.

"అభ్యంతరం ఉంటుందా?"

"అభ్యంతరమా?...ఎందుకూ?...అబ్బే. ఏమీ లేదు. కాని...కాని ఇప్పుడు కాదులెండి. మరోసారి ఎప్పుడైనా." అన్నాడు విశ్వం.

"అంటే ఎప్పుడు?"

విశ్వానికి ఏం చెయ్యటానికీ తోచలేదు. "నేను చెబుతాగా," అని తప్పించుకునే ధోరణిలో అన్నాడు.

వసంత ఇంకేం అనలేదు. విశ్వం మరెక్కడికీ వెళ్ళకుండా సరాసరి ఇంటికి వచ్చాడు. వసంత! అనాదిగా మానవుడి స్వార్థంలో వేళ్లు పాతుకొనిఉన్న సాంఘిక దురాచారానికి వారసురాలు! ఆమెనుచూస్తే తనకి జాలి వేస్తోంది.

ఇంట్లోకి విశ్వం అడుగుపెట్టగానే వెంకట్రామయ్యగారి స్వరం వినిపించింది. అప్పుడే వస్తున్న విశ్వాన్నిచూసి ఆయన సంతోషంగా అన్నాడు: "ఏరోయ్, పరీక్షల్లో నెగ్గావే. నీకు మంచి ప్రజంట్ ఇవ్వాలిసిందే!"

విశ్వం చిరునవ్వుతో లోపలికి ప్రవేశించి, "ఎప్పుడు వచ్చావు మావయ్యా, ఏమిటి విశేషాలు?" అని అడిగాడు.

"ఇప్పుడేరా. విజయవాడ పనిమీద వచ్చాను. పేపరుచూస్తే మీ రిజల్ట్సు కనిపించాయి. ఎలాగో ఇంత దూరం వచ్చానుగదా, నీకు కంగ్రాట్యులేషన్స్ చెప్పిపోదామని ఇలా వచ్చాను," అన్నాడాయన.

అయితే ఆయన వచ్చిన అసలు విషయం మధ్యాహ్నం భోజనాలయింతరవాత బయటపడ్డది.

జానకిని తన కివ్వాలని ఆయన ఉద్దేశం. ఆ మాట అప్పుడప్పుడు తన చెవిని పడుతూనే ఉంది. కాని తనేమాత్రం ఆమాట ఆలోచించలేదు ఇంతవరకూ. ఇప్పుడు విషయం తేల్చమని మావయ్య అంటున్నాడు.

జానకి!

ఆమె అంటే తన కెంతో అభిమానం.

కాని ఈ దృక్పథంలోంచి ఆమెని ఎప్పుడూ చూడలేదు.

తను జానకిని పెళ్ళిచేసుకోటంలో ఏదో అసహజత్వం ఉందనిపించింది విశ్వానికి. తను ఆమెని చిన్నపిల్లప్పటినించీ ఎరిగినవాడు. ఆమెతో ఆడుకున్నాడు. కవ్వించాడు, ఎగతాళి చేశాడు. కలిసి అల్లరిచేశాడు. ఆమె తనకి ఆత్మీయురాలు, స్నేహితురాలు.

అప్పటినించీ ఇప్పటివరకూ తనకి ఆమె అంటే అదే దృష్టి.

కాని ఇప్పుడు మరో సంబంధం ఏర్పడటానికి సంప్రదింపులు జరుగుతున్నాయి. ఆమెని వివాహం చేసుకుంటే తను సుఖపడగలడా! ఆమె సుఖపడగలదా! జానకి అభిప్రాయ మేమిటో? మావయ్య జానకిని అడిగిఉండడు. కొన్నిట్లో మావయ్య అభిప్రాయాలు తనకి నచ్చవు, తన ఇష్టం వచ్చినట్టు చేస్తాడేగాని సలహాగాని, అభిప్రాయంగాని అడగడు. పద్మ పెళ్ళప్పుడే మావయ్యకి కొంచెం కోపం వచ్చింది. ఈడుకాదని సాకు చెప్పారు, సూరి కివ్వటానికి. వాడి కివ్వటం నాన్న కిష్టం లేదు.

విశ్వం ఆలోచించి "ఉద్యోగమైంతరవాత చూద్దాంలే మావయ్యా" అన్నాడు. ఆయనకి నచ్చక పోయినా ఆ సమయంలో ఏమీ అనక వెళ్ళిపోయాడు.

9

విశ్వం రచించిన నాటిక ఆ రాత్రి ప్రదర్శిస్తున్నారు. నాటిక పేరు "మహారాజ పోషకులు." పుర ప్రముఖులు చాలామంది విచ్చేశారు. నాటకం

ప్రారంభం కాబోతుందని మైక్‌లో ప్రకటించారు. ఆడిటోరియంలో లైట్లు ఆరిపోయాయి తెర తొలగింది.

దృశ్యం ఒక పల్లెటూరులో సమావేశాలు జరుపుకునే ప్రదేశం. సెట్ వేశారు. రంగస్థలం ఏర్పాటు చెయ్యబడ్డది—సెట్‌లో ఒక భాగంగా కొబ్బరిఆకులు తోరణాలు కట్టారు. రెండు పెట్రోమాక్సులైట్లు కర్రలకి కట్టబడి వెలుగుతూ వున్నాయి. రంగస్థలంలోని రంగస్థలంమీదికి ఓ ముతకదుస్తులు ధరించిన వ్యక్తి వచ్చి "అయ్యా, ఇప్పుడు 'దశావతారాలు' భరతనాట్య ప్రదర్శన జరుగుతుంది. తమరంతా దయచేసి నిశ్శబ్దంగా ఉండాలని కోరుతున్నాను" అని పక్కకి వెళ్ళిపోయాడు. రంగస్థలంమీద తబలా, హార్మోనియం, వయొలిన్ వాయిద్యాలని వాటి తాలూకు వాద్యగాళ్లు సరిచూసుకొని శ్రుతికలుపుకుంటున్నారు. ఇంతలో గజ్జెల రవళి వినిపించింది నేపథ్యంలో. వాద్యసంగీతం ప్రారంభమైంది. ఒక ఎలజవ్వని రంగంమీదికి వచ్చి అందరికీ నమస్కరించి ప్రార్థన చేసింది.

గజ్జెలు ఘల్లు ఘల్లు మన్నాయి. తబలా లయకలిపింది. తధిత్తోం తదిగిణతోం...భరతనాట్యం ప్రారంభమైంది.

నేపథ్యంలో శ్రావ్యమైన కంఠం వినిపిస్తోంది...

మత్సరమున మరియంబుధిలో జొచ్చియున్న
సోమకు గ్రుంచియు
విచ్చలవిడి వేదములజునకు నిచ్చితివో మత్స్యవ
తారా! ఇచ్చితివో మత్స్యవతారా!"

ముద్ర పట్టింది నర్తకి.

చప్పట్లు చరిచారు ప్రశంసా పూర్వకంగా నేపథ్యంలో ప్రేక్షకులు...

పలుమరు నిను ప్రస్తుతి సేయగ చెలగి సురలు
జలధి మధింపగ
కలిమి బలిమి యొలమితో నొసగిన కులగిరిధర
కూర్మావతార!"

కూర్మావతార ముద్రపట్టబోతోంది నర్తకి.

నేపథ్యంలో ఉచ్చస్వరం దర్పంగా వినిపించింది.

రెడ్డొచ్చె మొదలాడు.

రెడ్డొచ్చె రెడ్డొచ్చె మొదలాడు...

ఒక ఆజానుబాహువిగ్రహం రంగస్థలం మీదికి వచ్చి ఠీవిగానుంచుంది పొన్ను వేసిన చేతికర్ర ఊగిస్తూ.

ఆగిపోయింది నర్తకి. ఆగిపోయారు వాద్యగాళ్ళు. ఆగిపోయింది గానం. మరికొంచెం సేపటికి మళ్ళీ గజ్జెలు ఘల్లుమన్నాయి—తకధీం తక తాహ తకిట తక......

"...విచ్చలవిడి వేదము లజునకు
ఇచ్చితివో మత్స్యవతారా!
నీ విచ్చితివో మత్స్యవతారా!"

మత్స్యవతార ముద్ర పట్టింది నర్తకి.

చప్పట్లు మళ్ళీవినిపించాయి ఆ చప్పట్ల చప్పుడులోంచి గంభీర స్వరం వినిపించింది.

పంతులొచ్చె మొదలాడు
పంతులొచ్చె మొదలాడు...

మరొక వ్యక్తి రంగ స్థలంమీది కొచ్చి రెడ్డి ప్రక్కన నుంచున్నాడు దర్జాగా. రెడ్డి ముఖం చిట్లించాడు.

భరత నాట్యం మళ్ళీ మొదటి కొచ్చింది......

"మత్సరమున మరియంబుధిలో..."

నేపథ్యంలోంచి ఓ స్వరం అధికారపూర్వకంగా హెచ్చరించింది.

చౌదరొచ్చె మొదలాడు
చౌదరొచ్చె మొదలాడు

నర్తకి నిస్సహాయంగా చూసింది. పట్టబోయే ముద్ర ఆగిపోయింది.

ఠీవిగా రంగంమీది కొచ్చాడు ఒక వ్యక్తి.

పాట మొదటి కొచ్చింది. గజ్జెలులయ వేయసాగాయి.

"...విచ్చలవిడి వేదములజునకు.....ఇచ్చితివో మత్స్యవతారా! నీ విచ్చితివో మత్స్యవతారా!" నేపథ్యంలోంచి ఖంగున మోగింది ఓ గొంతు.

నాయుడొచ్చె మొదలాడు
నాయుడొచ్చె మొదలాడు.

రంగం మీదికి వచ్చి నలువైపులా చూసి మీసాలు మెలేసి నుంచున్నాడు మరో వ్యక్తి.

తిరిగి ప్రారంభమైంది భరతనాట్య కార్యక్రమం. నర్తకి మత్స్యవతార ముద్రపట్టి పరవశితతో అలాగే నిలబడి పోయింది. ఇంతలో నేపథ్యంలో ఎవరో అరిచారు. నర్తకి తెప్పరిల్లింది.

"శ్రేష్ఠి వచ్చె మొదలాడు
శ్రేష్ఠి వచ్చె మొదలాడు

ఓలావుపాటివ్యక్తి తలపాగా సవరించుకొంటూ రంగంమీదికొచ్చి నిలబడ్డాడు.

మొదలాడ సాగింది నర్తకి విసుగ్గా. ముద్ర పట్ట బోతుండగా రెడ్డి అరిచాడు.

"ఇటు ఇటు."

మింగాలా ఊర్కోలేదు. అందరూ తమకే అభినయించాలన్నారు.

ముద్ర పట్టకుండానే నర్తకి నిలిచిపోయింది. ఎవరికి అభినయించాలి? ఎవరు గొప్ప? ఎవరు అర్హులు?

ప్రేక్షకుల సహాయం కోరారు. తమని అభిమానించేవారందరూ తమ వెనక నిలబడాలన్నారు.

ప్రేక్షకులు ఒక్కొక్కరూ అలాగే నిలబడసాగారు బారులు తీర్చి.

చిత్రమేమంటే రూపురేఖల్లో, వేషభావల్లో ఒకే పోలికగలవాడు మాత్రమే తమ తమ వరసల్లో ఉన్నారు.

తెరపడ్డది – మొదటి రంగం సమాప్తమైంది. లైట్లు వెలిగాయి.

ప్రేక్షకుల స్థానాల్లో మొదటి వరసనకూర్చున్న పెద్దల్లో సంచలనం కలిగింది. గుసగుసలు ప్రారంభమయాయి. రానురాను గుసగుసలు వాగ్యుద్ధాలుగా మారాయి. పెద్ద పెదగా కేకలు వేసుకుంటున్నారు. ఉద్రేకాలు పెరగసాగాయి. ఈ హడావిడిమిగతా స్థానాల్లో వాళ్ళకి కూడా పాకింది. హాలంతా కేకలతో మారుమోగుతూ గంద్రగోళంగా ఉంది. థియేటర్ 'యాజమానులే' భయపడి పోలీసుల్ని పిలిపించారు. వాళ్ళు జనాన్ని సర్దటానికి ప్రయత్నించారు. కాని పోలీసుల్ని చూడగానే ప్రేక్షక జనసమూహం మరింత పెచ్చు మీరిపోయింది. కొందరు గ్రీన్ రూమ్‌వైపు పరిగెత్తారు.

"ఈ నాటకం ఆడటానికి వీల్లేదు" అన్నారు ఖండితంగా కొందరు.

"ఆడి తీరాలిసిందే!" అన్నారు మరికొందరు మరింత పట్టుదలతో.

చేతులు కలిసేసితి వచ్చింది. పోలీసులు కలగ చేసుకున్నారు. నాటక ప్రదర్శన ఆగిపోయింది. పోలీసులు చెయ్యగలిగిందలా నాటకసంఘంవారెవరికీ అపాయం జరక్కుండా కాపలా కాయటమే. నాటకం ఆగిపోయిందనగానే కొందరు శాంతించి ఇంటిదోవ పట్టారు. వాగ్యుద్ధాలు తగ్గాయి. జనం వెళ్ళిపోసాగారు.

ఈ అవాంతరానికి విశ్వం నిశ్చేష్టుడై గ్రీన్ రూమ్‌లో తల చేతుల్లో పెట్టుకుని కూర్చున్నాడు. నర్తకి వేషంకట్టిన వసంత అలిసిపోయి పాలిపోయిన ముఖంతో కుర్చీలో కూలబడ్డది. తన ప్రథమప్రయత్నం ఇలా పరిణమించినందుకు నిరాశపడవాలమె. నాటక సంఘంలోని సభ్యులు, పాత్రధారులు రంగస్థలంమీద పరిసికులు చర్చించుకుంటూ నిస్పృహతో పచార్లు చెయ్యసాగారు.

గ్రీన్ రూమ్‌లోఉన్న విశ్వం గొణిగాడు.

"నాటక సంఘంలో నేను సభ్యుణ్ణిగా చేరి ఉండకపోతే బాగుండేది. కనీసం నేను నాటకం రాయలే నన్నప్పుడు వాళ్ళు నన్ను వొదిలినా సరిపోయేది. ఎంత దురదృష్టం. నా సంగతి అలా ఉంచండి. పాపం, వాళ్ళ శ్రమంతా బూడిదలోపోసిన పన్నీరయింది. ఎంత అవస్థపడ్డారు! ఎంత నష్టపోయారు!"

"ఇటువంటి నాటకం ఎందుకురాశారు?" అంది వసంత.

"బుద్ధి గడ్డితిని..."

అతనలా పశ్చాత్తాప పడటంచూసి వసంతకి జాలివేసింది. కొంచెం అనునయ పూర్వకంగా అంది.

"అయినా ఇందులో అంత కొంపలంటుకునే విషయమేముంది? అనాలోచితంగా ప్రేక్షకులు తొందరపడ్డారు గాని..."

"ఉంది లేకపోలేదు. కాని ఇలా మూర్ఖంగా ప్రవర్తిస్తారని నే ననుకోలేదు. ఇంకా నయం పూర్తిగా నాటకంచూస్తే నన్నీ ఊళ్ళోనుంచి తరిమేసే వాళ్ళేమో!"

"వాళ్ళు సరిగా అర్థం చేసుకోలేనండీ."

"సహృదయత కావాలి దేనికైనా. 'అరసికాయ కవిత్వ నివేదనం శిరసిమాలిఖ' అన్నాడు. కులతత్వాల మీద సున్నితమైన వ్యంగ్య విమర్శచేస్తే కత్తులూ, కటార్లూ నూరితే నే నేంచెయ్యను! నే నెవర్నీ కావాలని తిటలేదు, తిమ్మలేదు. అభిప్రాయ ప్రకటన చేసే స్వేచ్ఛ ఇంకా మన దేశానికి రాలేదు."

వసంత అతనివైపు జాలిగా చూసింది.

"అందరూ మీలాంటివాళ్ళే ఉంటారా?"

"ఎవరూ ఎవరిలాగా ఉండరు. మనిషి సంకుచితంగా ఆలోచించకూడదనే నేననేది."

"మీది విశాల హృదయమండీ"

"ఆ కబురు చెప్పకండి."

"మీ భావనబట్టి చెబుతున్నాను. నిజంగా నాటిక చాలా బాగా రాశారండీ. నా పోర్షనే కాక నాటిక అంతా కూడా ఎన్నోసార్లు చదివాను. సాహిత్యంలో నాకు ప్రవేశం లేనిమాట నిజమే. కాని నాటిక చాలా గొప్పగా ఉందని నాకనిపిస్తోంది."

"ఫలితం చూసికూడా అలాగే అంటున్నారా? నన్ను ఊరడించటానికేనా?"

"నేనబద్ధం చెప్పటం లేదు."

"ఇంతకుముందు ఎప్పుడూ ఈ విషయం మీరు చెప్పలేదు."

"మర్చిపోయాను. చెప్పాలనే అనుకునేదాన్ని. కాని..."

"కాని...?"

"మీతో మాట్లాడుతున్నంతసేపూ ఆ విషయం నాకు గుర్తొచ్చేది కాదు. ఎందుకో తెలియదు. తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తుంది. సరిగా మీరు వెళ్ళిపోగానే ఆ సంగతి జ్ఞాపకం వొచ్చేది. ఎందుకంటారు?"

"నాకు మనస్తత్వశాస్త్రం తెలియదు."

వసంత నవ్వింది.

"ఈ నాటిక పుస్తకంగా అచ్చు వేయించండి"

"ఎందుకూ! ఈ శిక్ష చాలకనా?"

"దీంతో మీకు మంచి పేరు వస్తుందండీ."

"పేరుకోసం నేను అది రాయలేదు."

"దానంతట అదే వొస్తుంటే మీరేం చేస్తారు?"

"చెడ్డపేరొస్తే మీరు సగం పంచుకుంటారా?"

వసంత విశ్వం ముఖంలోకి చూసింది విస్మయంతో.

"మంచిపేరొస్తే అంతా మీకే కావాలి కదూ పాపం?"

విశ్వం ఆమె ముఖంలోకి కొంచెం ఆశ్చర్యంగా చూశాడు.

ఆమె మరోవైపుకి చూసింది.

"అంతేమరి." అన్నాడు నవ్వుతూ.

"కవిగారికూడా స్వార్థం ఉందన్నమాట."

"నన్ను కవిగారు అనకండి."

"ఏం, మీరు కవులేగా?"

"కాదు. నాలో కవిత్వం లేదు. ఉంటే కాస్తోకూస్తో చిత్రకళ ఉంది అంతే."

"మీరు బొమ్మలు వేస్తారా?" ఆశ్చర్యపోతూ అంది వసంత.

"ఏదో వేస్తాను."

"ఎప్పుడూ చెప్పలేదే!"

"నాటకం జయప్రదమైతే నర్తకి భంగిమలో మీ చిత్రం వేసి ఇద్దామని అనుకున్నాను."

"అయితే ఇప్పుడివ్వకూడదా?"

"ఉత్సాహం లేదు."

"నాటకం పాడవటానికి నేనా కారణం? ఇదెక్కడి అన్యాయమండీ?"

"మీరని ఎవరన్నారు."

"మరి నాటకం జయప్రదం కావటానికీ నా బొమ్మకీ ఏమిటి సంబంధం?"

"ఏమీ లేదు," అన్నాడు విశ్వం ఆమె వాదనకి లోలోపల ఆమెని ప్రశంసిస్తూ.

"అయితే మాట నిలబెట్టుకుంటారా?"

"చూద్దాం."

"అలా అంటే కాదు."

"బొమ్మవెయ్యటం అంటే మాటలు కాదు. గంటలతరబడి మీరు మోడల్ ఇవ్వాలి. ఊరికే బలవంతం చేస్తే ఏం లాభం?"

"ఇస్తానులెండి."

"అయితే సరే."

మాటఇచ్చిన ప్రకారం విశ్వం ఓ రోజు ఉదయం పరికరాలన్నీ తీసుకుని వసంత ఇంటికి వెళ్ళాడు. ఆమె చిత్రం తయారు చెయ్యటానికి అతను చెప్పిన భంగిమలో ఆమె నిలబడింది. రోజూ ఉదయం విశ్వం కార్యక్రమం అదే. త్వరలోనే స్కెచ్ పూర్తిచేశాడు. కాని రంగులు వెయ్యటం చాలా నెమ్మదిగా సాగుతోంది. దగ్గిరే ఉండి వసంత ఏదో కబుర్లు చెబుతూ ఉంటుంది. విశ్వం మాటలసందడిలో పడి బొమ్మసంగతి మర్చిపోతాడు. ఇప్పుడు విశ్వం తనని 'అండీ' అని పిలిస్తే ఆమె ఒప్పుకోదు. 'కవిగారూ' అంటే విశ్వం ఒప్పు

కోడు. ఈ రోజుల్లోనే విశ్వం నాటిక ఎవరో ప్రచురణలసంస్థవారు ప్రకటించారు. అనుకోకుండా దానికి బ్రహ్మాండమైన ప్రచారం వచ్చింది. కాని ఆ నాటిక ప్రదర్శన నిషేధించబడ్డది.

10

ఆషాఢం. వల్లటిమబ్బులు చేస్తోంది ఆకాశం. తొలకరి పలకరించి వెళ్ళింది. పలెజనం మళ్ళీ పొలం పనుల్లోకి మళ్ళారు. వారుమళ్లు పచ్చపచ్చగా కన్నుల పండువుగా ఉన్నాయి. కాలవ పదేటంవల్ల నీటిగాలి వీస్తోంది.

వసారాలో కూర్చుని సూరి కొబ్బరితాడు పేనుతున్నాడు. సూర్యుడు పడమటిదిక్కుకి చేరుకున్నాడు నీరెండ కాస్తోంది. పనిలేకపోయినా కల్పించుకుని ఏదో చెయ్యటం సూరి కలవాటు. సామాన్యంగా అతను మర్రిచెట్టుకింది ఊకపంపుకు సమావేశాలకి పోడు. మొదట మొదట ఊళ్ళోని తోటివాళ్ళు సూరికి గర్వం అనుకున్నారు. కాని ఆమధ్యన జరిగిన కొన్ని కొన్ని సంఘటనలవల్ల వాళ్ళలో ఆ అపోహ తొలగిపోవటమే కాకుండా సూరి అంటే ఓవిధమైన గౌరవభావం కూడా ఏర్పడ్డది. ఇటీవలనే అతనివల్ల గ్రామానికి ఓ మేలు జరిగింది. ఊళ్ళో కరణంగారు తమ తండ్రి గారి జ్ఞాపకార్థం విడిచిన ఆంబోతు విచ్చలవిడిగా సంచరిస్తూ అందరికీ కంటకప్రాయంగా తయారైంది. దానిమూలాన రెండుపక్షాలు కూడా ఏర్పడ్డాయి— కరణంగారి పక్షమూ, మునసబుగారి పక్షమూ. క్రితం సంవత్సరం యీ ఆబోతు కారణంగానే ఓ చిన్న గలాటా జరగటం, కక్షలు పెరగటం సంభవించాయి. ఈ సంవత్సరం వెంకట్రామయ్యగారి పసుపుమళ్ళు తొక్కి పాడుచేసింది ఆబోతు. ఆ దృశ్యం సూరికంట పడ్డది. పాలేరు వెంకన్న 'సై' అనమన్నాడు. కాని సూరి తొందరపడలేదు. ఆ మర్నాడే పక్క ఊళ్ళో పశుప్రదర్శనకి యీ ఆబోతును పంపటం జరిగింది. అదిమళ్ళీ తిరిగిరాలేదు. ఊరివాళ్ళకి అది చాలారోజుల వరకూ సమస్యగానే ఉంది. పీడ వదిలిందని సంతోషించారేగాని దాని ఆచూకీ తియ్యటానికి ఎవరూ గట్టిగా ప్రయత్నించలేదు. అది అక్కడినించి తప్పించుకొని ఎక్కడికో పోయివుంటుందని అనుకొన్నారు. కరణంగారు అసలుసంగతి తరవాత బయట పెట్టారు. పశుప్రదర్శన సంఘం తరఫున ఎవరో వొచ్చి తమని బలవంతం పెట్టటంవలన తను ప్రదర్శనకి పంపక తప్పలేదనీ, తరవాత తనకి తెలిసిన ఒక మిత్రుడు దానిని సహకార సంఘానికి ఇప్పించవలసిందని వొత్తిడి చేశాడనీ, తను మిత్రుడిమాట కాదన లేకపోయాడనీ ఆయన వివరించేశాడు. ఆ తరువాత చాలారోజులకి గాని అసలు నిజం బయటపడలేదు. ఈ తంతు నడిపించింది మరెవరో కాదు. వెంకట్రామయ్యగారబ్బాయి సూరి. కాని అతనే ఉద్దేశంతో చేశాడో మాత్రం ఎవరికి స్పష్టంగా తెలియదు. సూరికి ఊళ్లో కక్షలు సరిపడవనీ వాటిని తొలగించటానికి ఈ యుక్తి పన్నాడనీ కొందరంటే, సొంత పొలం రక్షించుకోటానికి ఇలా చేశాడని మరి కొందరంటారు. ఇవన్నీ ఊహాగానాలే. సూరినడిగితే తనకా విషయమేమీ తెలీదని విసుక్కుంటాడు. అతనేదో విధంగా ఆబోతుని తోలివేయటం కరణంగారికీ, మునసబుగారికి వారి అనుయాయులకీ కూడా సంతోషంగానే ఉంది తమ పరువు ప్రతిష్ఠలకి భంగం లేకుండా సమస్య పరిష్కారమైంది. సూరి ఏ పార్టీకి చెందినవాడు కాడు, అందరితో అతను సమానంగానే మాట్లాడుతాడు. అదికాక క్రితం సంవత్సరం అతను ఓ సందర్భంలో చూపిన ధైర్యసాహసాలకి అతనికి ఊళ్లో గౌరవస్థానం లభించింది. ఆ సంఘటన జరిగిన రోజున బాగా చీకటిపడి సూరీ, పాలేరు వెంకన్నా పొలంనించి తిరిగివస్తున్నారు. ఆ కాలంలో వర్షాలు కురవటంవల్ల పంటలు దెబ్బతినే సూచన కన్పించింది. కాలవ ఉప్పొంగిపోతోంది. అకస్మాత్తుగా సూరికి అనుమానం తగిలింది. కట్టకి ఇదివరలో గండిపడ్డది. ఇప్పటికీ అది సరిగా బాగుచెయ్యలేదు. తాత్కాలికంగా అడ్డం వేశారు. వరదవచ్చే సూచన కనిపిస్తోంది. ఎగువుగా ఏరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఊళ్ళోకి వెళ్లి మళ్ళీ వచ్చేలోపుగా ప్రమాదం జరిగినా జరగొచ్చు. వెంకన్నతో ఆలోచించి, సూరి అతనితో సహా కాలవ ఈది అవతలిగట్టుకు చేరాడు. అటువైపు దిగువప్రదేశం అంతా అడవి. అనువైనస్థలం వెతికి ఇద్దరూ కలిసి గండికొట్టారు. నీరు బంజర్లలోకి మళ్లింది. స్వేచ్ఛగా ఊపిరిపీల్చి సూరి ఊళ్లోకివెళ్లాడు. ఆ మర్నాడు సొంతకళ్ళతో రైతులు చూసేదాకా ఈ విషయం ఎవరికీ తెలియదు. ఆరాతీసి అది సూరి పనేనని తెలుసుకున్నారు. అంతపని చేసినవాడు కిమ్మనకుండా తనేమీ చెయ్యనట్టుగా ప్రవర్తించటం

అందరికీ అత్యంతాశ్చర్యం కలిగించింది. ఎవరైనా ఈ ప్రసక్తి అతనిముందు తెస్తే అదేమీ ఘనకార్యం కాదన్నట్లు మాట్లాడతాడు.

ఇలాంటివే కొన్ని చెప్పుకోతగ్గ మేళ్ళు చెయ్యటంవల్ల అతనంటే ఊరివాళ్ళకి అభిమానం ఏర్పడ్డది. చిత్రమేమంటే ఇలా ఊళ్ళో తనని అభిమానిస్తున్నారనే విషయం అతని ఆలోచనలోకి రాదు. ఆ విషయం అతనికి తెలియదని కాదు. ఒక విధమైన నిర్లిప్తత అతని ముఖంలో ద్యోతకమవుతుంది. ఏదో సమావేశంలో సూరిని గూర్చి ఈ మధ్యన ఎవరో ప్రశంసా వాక్యాలు పలికితే, వెంటనే లేచి అన్నాడు.

"నేనూ ఊరివాళ్ళలో ఒకణ్ణి. ఒకవేళ నేనేదైనాచేస్తే అందులో సేవాధర్మమేం లేదు. నాకు అవసరమనిపించిన పనులే నేను చేశాను. ఇందులో ప్రశంసించటానికేం లేదు."

మరొక వ్యక్తి ఈ మాటలంటే మర్యాదకోసం, వినమ్రతకోసం అన్నాడని సులభంగానే ఊహించేవాళ్ళు జనం. కాని ఆ మాటలు అన్నవాడు సూరి. ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ మెప్పుని సూచించే మాట ఒక్కటి పలికినా ముఖం చిట్లించుకుని చిరాకుపడే ఒకే వ్యక్తి. పొద్దస్తమానమూ పనివాళ్ళతో పాటు వొళ్ళు వొంచి చాకిరిచేసే ఆసామీ. అజమాయిషీ పేరుతో నడుంమీద చేతులు ఆనించి దిక్కులు చూస్తూ నిలబడే కర్ర పెత్తనదారు కాదు సూరి.

పడమటి ఆకాశం ఎర్రబారుతోంది. ఆ సమయంలో ఓ వ్యక్తి సూరిదగ్గిరికివచ్చి 'నమస్తే' అన్నాడు. దగ్గర్లో ఉన్న చిరిచాపలాగి "కూర్చోండి" అన్నాడు. సూరి, ఆ వ్యక్తిని ఆ పాదమస్తకం చూసి.

"నేను కరణంగారి దగ్గిర్నుంచి వస్తున్నానండీ." కూర్చుంటూ అన్నాడతను.

"అలాగా!"

"నా పేరు వెంకటపతి. ఈ సంవత్సరం నేను బి. ఏ. ప్యాసయాను. సూరిగారు మీరేకదూ?"

"అవునండీ." అంటూ సూరి దగ్గిర్లో ఉన్న కంచు మరచెంబులోని నీళ్ళు పంచపాత్రలో పోసి వెంకటపతి కిచ్చాడు. ఆ చల్లటి మంచితీర్థం తాగేసి అతను తను వచ్చినపని చెప్పాడు.

"కాలేజీలో చదువుతున్నప్పుడు నేను సంఘసేవ చేసేవాడినండీ. కాలేజీ సాంఘిక సేవాసమితి సభ్యుణ్ణి. మొన్న ఆమధ్యన ఈ ఊరి మట్టిరోడ్డుమీద కంకర వేసిన బృందంలో నేనుకూడా ఉన్నాను. ఈ ఊళ్ళో నాకు చేతనైనంతవరకు కొన్నాళ్ళు సంఘసేవ చెయ్యాలని ఉందండీ."

"మంచిది." అన్నాడు సూరి

"ఏంచేస్తే బావుంటుందంటారు?"

"నాకా విషయాలు తెలియవే."

"మీకు తెలియకపోతే ఇంకెవరికి తెలుస్తాయి?"

"అదేమిటలా అంటారు?"

"కరణంగారు మీ విషయమంతా చెప్పారు. మీ సలహా తీసుకుని ఏదైనా చేస్తే బావుంటుందని ఆయన చెప్పినమీదటే మీ దగ్గిర కొచ్చాను. మీరు సహాయపడతారని ఆశపడుతున్నాను."

"నావల్ల సహాయం జరిగే వీలుంటే సంతోషంగా చేస్తాను. కాని నేనేం చెయ్యగలనో నాకే తెలియదు. మీ కార్యక్రమమేమిటో సెలవివ్వండి."

"అది తయారు చెయ్యటానికే మీ సలహా అడుగుతున్నాను."

సూరి ఆలోచించాడు. ఆ క్షణంలో అవసరాన్నిబట్టి తోచిందేదో చెయ్యటమే గాని తనింతవరకూ ఫలానా ఫలానా వ్యవహారాలు ఫలానా విధంగా చెయ్యాలని ఆలోచించి ఆ కార్యక్రమం ప్రకారం నడవటం ఎరగడు.

"మీరీ ఊళ్ళో నే స్థిరపడిపోతారా?"

"అబ్బె, లేదండి."

"ఎన్నాళ్ళుంటారు?"

"బి. ఏ. ప్యాసయాను కదండీ. ఏదైనా ఉద్యోగం వస్తే వెళ్ళిపోతాను. ఈ లోపల వీలైనంతవరకూ నలుగురికీ పనికొచ్చే పనేదైనా చెయ్యాలని ఉబలాటం."

సూరి పొడిగా నవ్వాడు.

"చెయ్యవచ్చు. దానికేం. కాని అర్ధాంతరంగా వెళ్ళిపోతే ఏంలాభం?"

"ఎవరికి?" అన్నాడు వెంకటపతి.

"ఊరికీ, మీకూ కూడా."

"జరిగినంత పనే జరుగుతుంది."

"అయితే సరే" అన్నాడు సూరి.

"సూరి దగిర్నించి సూచన లేవి వొచ్చేటు లేనందువల్ల వెంకటపతే కొన్ని ఆలోచనలు వెలిబుచ్చాడు.

"యువజనులకి రాత్రిబడీ. ఆరోగ్యసూత్రాల ప్రచారమూ, వాటి ఆచరణా, సమిష్టి శ్రమదానమూ మొదలైనవి ప్రారంభిస్తే బాగుంటుందనుకుంటాను."

"అలాగే.?"

వెంకటపతి ఉత్సాహంగా కార్యక్రమం ప్రారంభించాడు. మొదటిరోజు పెద్దల్ని సమావేశపరిచి తన అభిప్రాయాలు వెలిబుచ్చాడు. కొందరు యువకులు ముందుకొచ్చారు. తోడ్పాటు ఇస్తామన్నారు. రాత్రిబడి నెలకొల్పబడింది. పరిసరాలనీ, ఊరినీ ఎలా శుభ్రంగా ఉంచాలో ప్రచారం జరుగుతోంది. ఉద్యానం వెయ్యటానికి శ్రమదానం వాగ్దానం చేశారు కొందరు యువకులు.

ఈ పనులన్ని కొత్తిగా వింతగా వున్నాయి జనానికి. కొద్ది రోజుల తరవాత ఈ విషయం పాతబడి మామూలు వ్యవహార మైంది.

మొదట్లో ఉత్సాహంగా రాత్రి బడిలో చేరిన యువకులు రానురాను పల్చబడ్డారు. హాజరు తగ్గిపోతోంది రోజురోజుకీ.

ఆరోగ్య సూత్రాలు ఆచరణలో పెట్టడానికి బద్ధకం వేస్తోంది జనానికి.

పగలంతా వొళ్లు విరుచుకుని పొలాల్లో పనిచేసిన తరవాత ఇంకా ఈ శ్రమదానానికి ఓపిక మా కెక్కడిదనసాగారు ఆరంభశూరులు.

"మా ఊళ్ళోకూడా చదువుకున్నవా రున్నారులెండి" అని మొహం ఎదటనే వెంకటపతితో అన్నారు కొంతమంది.

"ఒకళ్ళు చెప్పాలిసిందీ, మేము వినాలిసిందీ ఏముంటాయిలెండి కొత్తిగా" అన్నారు సమావేశాలకి హాజరుకావటం ఇష్టంకాక మానుకున్న జనం.

"ఇదంతా మీకోసమే." అన్నాడు వెంకటపతి కోపంగా, విసుగ్గా.

"మాకోసం మీకంత శ్రమ దేనికిలెండి!" అని ఎత్తిపొడిచారు పల్లెయువకులు.

"ఇక్కడేదో చేస్తే వీరికేదో ఉద్యోగం వస్తుందిట, మాకు తెలుసు" అన్నారు దళ వ్యవహారాల్లోకి మిడిమిడి జ్ఞానం సంపాదించిన కొందరు. వెంకటపతి చిరాకేసింది. తను నిజాయితీతో వాళ్లని బాగుచేదామనీ, చేతనైనంతవరకు పైకి లాగుదామనీ ప్రయత్నిస్తే ఇదా ప్రతిఫలం! ఈ కోనపల్లి ప్రజలకు అహంకారం ఎక్కువ. వాళ్లలో ఏకోశానా అర్థం చేసుకునే శక్తి లేదు. తను ఈ ఊరు విడిచిపెట్టేసి ఇంకో ఊరు వెళ్లడం ఉత్తమం. ఇక్కడ తన కాలం వృథా చెయ్యకూడదు.

వెంకటపతి గుడారం ఎత్తేశాడు కోనపల్లి గ్రామం నించి. వెళ్లిపోయేముందు సూరిని కలుసుకుని వాళ్లందర్నీ చడామడా తిట్టేసి తన కార్యక్రమం తనని అర్థం చేసుకోగల మరో పల్లెలో కొనసాగిస్తానని చెప్పాడు.

అసలు అటువంటిపల్లె ఉంటుందా?" అన్నాడు సూరి.

"నేను నిరాశావాదిని కాను. మీరు పల్లెటూరివారయి ఉండీ పల్లె ప్రజల్ని అర్థం చేసుకున్నట్టు లేరు. వాళ్లలో శక్తీ, ఉత్సాహమూ, పట్టుదలా లేవనా మీర నేది?"

"అది కాదు. మిమ్మల్ని అర్థంచేసుకోగల పల్లె ఉంటుందా అని."

వెంకటపతి కాసేపు ఆలోచించి అనుమానంగా సూరివైపు చూసి అన్నాడు.

"అయితే లోపం నాదే ననా మీరనటం?"

"లోపంసంగతి కాదండీ. మిమ్మల్ని గురించి తెలుసుకోటానికి వాళ్ళకి అవకాశం తక్కువకదూ?"

"సాటిమనిషిని అర్థంచేసుకోటానికి ఎంత వ్యవధి కావాలండీ?"

"మీలాంటి మనిషిని మీరు సులభంగా అర్థం చేసుకోగలరు. నేనూ అంతే. మా ఊరివాళ్లూ అంతే. కాని మీరు మాలో ఒకరు కారుగా."

వెంకటపతి కనుబొమలు చిట్లించి సూరివైపు చూసి విచారంగా అన్నాడు: "చదువుకున్న వారు, మీకుకూడా ప్రాంతీయ దురభిమానం ఉందన్నమాట."

సూరి ఆశ్చర్యపోయి వెంకటపతివైపు చూశాడు. అతనేదో అనబోయి మళ్ళీ వెంటనే మాటమార్చుకున్నాడు.

"జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ". కదండీ నూరిగొంతులో ఏదో అపహాస్యం ధ్వనించినట్లు వెంకటపతికి అనుమానం వేసింది. అతను పొడిగా నవ్వాడు. ఇంకా ఈ ప్రజలు ఇలాంటి దురభిమానాలతో కొట్టుకుంటున్నారు. తన సంఘసేవ వాళ్ళకేం రుచిస్తుంది!

"వెళ్ళొస్తాను." అతను సెలవు తీసుకున్నాడు.

తలుపు చెక్క పక్కన నిలబడి ఈ సంభాషణ అంతా వింటున్న జానకి వెంకటపతి గడపదాటగానే పక్కన నవ్వుతూ వసారాలో కొచ్చి అంది.

"ఎల్లుండి వేములవరం వెళ్ళొచ్చాట్ట!"

నూరి జానకివైపు చూసి చిన్నగా నవ్వాడు.

"అంతే మరి."

"బావకూడా ఇంచుమించు అంతే."

నూరి ఏదో ఆలోచిస్తున్నట్టుగా ముఖం పెట్టాడు.

"ఎలా తెలుసు?"

"మాటల్లో తెలియదూ? అయితే ఇంత అధ్వాన్నం కాదు. ఆలోచన ఉంది. ఎలాగైనా తెలివిగలవాడు కదూ?"

నూరి మళ్ళీ ఏదో ఆలోచించి ఆమెవైపు చూసి అన్నాడు: "బావంటే నీకు అభిమానమా జానకీ?"

జానకి అతనివైపు కొంచెం వింతగా చూసి అంది: "నీకుమాత్రం లేదూ?"

కనుబొమలుముడిచి నూరి మళ్ళీ ఆలోచనలో పడ్డాడు. గడుసుపిల్ల జానకి. మాటల్లో తేలదు.

11

శ్రావణమాసం నోములకి పద్మ పుట్టింటికివచ్చింది. తోరణాలతో ఇలు కలకలలాడుతోంది. ఈ హడావిడి చూసి విశ్వం ఆశ్చర్యపోయాడు. పద్మ ఎన్నడూ పూజా పునస్కారాలు చేసి ఎరగదు. ఇప్పుడిలా అకస్మాత్తుగా ఆమెనూరటానికి కారణం ఏమిఉంటుందో ఊహించలేకపోయాడు విశ్వం. అసలామె తిరహాయే మారిపోయింది. వేషంలో, మాటతీరులో, అభిరుచుల్లో అభిప్రాయాలలో ఇప్పటి పద్మకీ పూర్వపుపద్మకీ పోలిక లేదు. విశ్వం వాకిట్లో కూర్చుని పేపరు చదువు కుంటుండగా 'శ్రీ కృష్ణపరబ్రహ్మణేనమః' అని విని పించి తలెత్తిచూశాడు. ఉపాదానంకోసం నిలబడి ఉన్నాడా ఆగంతుకుడు. ప్రత్యేకించి ఇటువంటి యాచన అంటే విశ్వానికి ఒళ్ళుమంట. "వెళ్ళండి" అన్నాడు ముఖం చిట్లించుకుని. కాని ఇంతలో పద్మ దోసిలినిండా బియ్యం తెచ్చిపెట్టింది. ఆయన 'కృష్ణార్పణం' అని వెళ్ళిపోయాడు.

"ఇదెప్పటినించి?" అన్నాడు విశ్వం ఎగతాళిగా.

"ఏది?"

"ఈ ఔదార్యం"

"ఇదికూడా ఔదార్యమేనా?"

"ఇదివరకు నీకీ అలవాటు లేదులే, అందుకని అడుగుతున్నాను."

"అలవాట్లు ఎప్పుడూ ఒక్క మాదిరిగానే ఉంటాయా?"

"భక్తికూడా బాగా అబ్బినట్టుందే?"

"తప్పా?"

"తప్పొప్పుల సంగతి కాదులే. ఇంత అకస్మాత్తుగా దేవుడిమీద నమ్మకం ఎలా కుదిరిందా అని!"

"ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి."

"ఒక్కొక్కసారి ఇతర్ల అభిప్రాయాలే మనవి ఔతాయి కూడా."

"ఐతే ఏమంటావు?"

"అభిరుచులుకూడా అలాగే ఇతర్ల అభిరుచుల కనుగుణంగా మారిపోతూంటాయి.

"మారితే నష్టమేమైనా ఉందా?"

"నష్టమేముంది? మనవ్యక్తిత్వం మంటగలుస్తుంది. అంతే."

"బలవంతంగా మారితే."

"ఏదిష్టంగా ఐతే ఏం?"

"ఇప్పుడు వాదనెందుకులే."

"ఏం? అది నీ కిష్టమేగా? ఓహో, ఆ విషయంలో కూడా మార్పు వచ్చింది కాబోలు. డాక్టరు ఏమో అనుకున్నానుగాని తన అభిప్రాయాల్ని ఇతర్ల మీద బాగానే రుద్దగలడే!"

"అలాగే నా మాట్లాడేది?" అంది పద్మ చిరుకోపంతో.

"డాక్టరుగారు నా స్నేహితుడే. ఎలా మాట్లాడటానికైనా నాకు స్వాతంత్ర్యం ఉంది.

"అయితేసరే, అద్దం ఎదురుగా కూర్చుని మాట్లాడుకో. నేను పేరంటం పిలవటాని కెళ్ళాలి."

అని పద్మ లోపలికి వెళ్ళిపోయింది. విశ్వం చిరునవ్వు నవ్వుకున్నాడు. ఎంతగా మారిపోయింది. పద్మ! పూర్వం ఎరుపురంగంటే ఆమెకి అసహ్యం. ఇప్పుడు ఎరుపురంగు చీరలే తిరుచుకడుతుంది. ఇదివరకు అంత స్వేచ్ఛగా ఇంట్లో తిరిగేది ఇప్పుడేమో ప్రతి దానికీ తడుముకుంటున్నట్టుగా ఉంటుంది. తనేమిటో చుటపుమాపుగా వచ్చినట్టు మాట్లాడుతుంది. ప్రతి విషయంలో డాక్టర్ ఇష్టా ఇష్టాలు సూచిస్తుంది. ఇంతగా ఆమె తన వ్యక్తిత్వాన్ని పోగొట్టుకోటం విశ్వానికి కొంచెం కష్టంగా ఉంది. ఈ మార్పులన్నీ ఎంతవరకు పద్మ తెచ్చిపెట్టుకున్నవో, ఎంతవరకు డాక్టర్ గారి ప్రభావం ఫలితాలో తనకి తెలియవు. కాని ఇలా మారటం అంత సమంజసం కాదని తోస్తోంది తనకి. పద్మ నడిగితే ఈ విషయాలు చాలా తేలిగ్గా తోసేసుంది. తనేం మారలేదనీ, ఒక వేళ మారినా ఆ విషయం విశ్వం చెప్పేదాకా తనకే తెలియదనీ అంటుంది.

శ్రావణమాసం అయిపోయింది. పద్మ ప్రయాణం కట్టింది. విశ్వం తీసుకొని వెడుతున్నాడు. వెళ్ళబోతూ గోపికి పదిరూపాయల నోటిచ్చింది పద్మ.

"వాడికి నువ్వివ్వట మేమిటి?" అన్నారందరూ. కాని వాడు వెంటనే ఆ నోటు నిక్కరు జేబులో దాచుకున్నాడు. అప్పుడప్పుడూ అక్కయ్య తన కిచ్చిన ప్రజంటు చూసుకుంటుంటే అదో తృప్తిగా ఉంటుందని వాడికి ఆ సమయంలో అనిపించింది.

"స్త్రీలకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు" అన్నాడు విశ్వం.

"అబ్బ నువ్వూరుకో అన్నయ్యా. నువ్వు ప్రతి దానికీ వాదిస్తావు" అంది పద్మ.

విశ్వం మళ్ళీ నోరెత్తలేదు. తను వాదిస్తాడట! గంటలతరబడి తనతో పిడివాదం వేసుకుని ఉక్రోషం తెప్పించే పద్మేనా యీ మాటలు అన్నది!

హైదరాబాద్ లో డాక్టరుగారి ఇలు, ఆస్పత్రి కూడా నగరంలో ఒకమూల ఉన్నాయి. ప్రయాణపు బడలికతో కుర్చీలో కూలబడి "ఏమిటయ్యా, విసిరేసినట్టు ఇక్కడపెట్టావు మకాం?" అని రిమార్కు చేశాడు విశ్వం. శ్రీనివాసరావు నవ్వి ఊరుకున్నాడు.

ఆ సాయంత్రం శ్రీనివాసరావు తన డిస్పెన్సరీ చూపించాడు విశ్వానికి. నర్సింగ్ హోమ్ వేరేచోట ఉంది. ఇలూ, డిస్పెన్సరీ, నర్సింగ్ హోమ్ అన్నీ కలిపి ఒకేచోట పెట్టమని సలహా ఇచ్చాడు విశ్వం.

"అలా అయితే చిక్కులున్నాయి" అన్నాడు డాక్టర్.

"ఏమిటా చిక్కులు?"

"పొద్దస్తమానమూ యీ రోగులగొడవతో నేను సతమతమవటమే కాక పద్మకికూడా ఆ అవస్థదేనికి?"

విశ్వం అసలువిషయాన్ని తప్పించి అన్నాడు.

"'రోగుల గొడవ' అని విసుక్కునేవాడివి నువ్వేం డాక్టరువయ్యా?"

"ఈ. ఎన్. టి. స్పెషలిస్ట్"ని డాక్టర్ చిరునవ్వు నవ్వుతూ అన్నాడు.

"అసలు ప్రశ్న తప్పించకు. రోగులకు సేవచేసే అవకాశం లభించినందుకు సంతోషంతో ఆ పని చెయ్యాలిగాని విసుక్కోటం డాక్టరైనవాడికి ధర్మం కాదు. అంతో ఇంతో సంఘసేవ చెయ్యాలనే అభిలాష ఉన్న నాలాంటివాడికి కా అవకాశమే దొరకదు. దొరికిన నీలాంటివాళ్లు అసంతృప్తితో బాధపడతారు. మనుషుల చిత్తప్రవృత్తుల్నిబట్టి ఉద్యోగాలు దొరికితే ఎంత బావుంటుంది!"

డాక్టరేమీ సమాధానం ఇవ్వలేదు. చిరునవ్వు నవ్వుతూ విశ్వంవైపు చూడసాగాడు. డాక్టర్ సమాధానం చెప్పకపోవటంతో విశ్వానికి మరింత అవకాశం లభించింది తన వాగ్ధోరణి కొనసాగించటానికి.

"ఒక్క ప్రశ్న అడుగుతాను చెబుతావా? తడుముకోకుండా సమాధానం చెప్పాలి."

"అడుగు."

డాక్టర్ కళ్ళలోకి గంభీరంగాచూస్తూ బాణంలా వొదిలాడు తనప్రశ్న విశ్వం.

"నీ జీవితలక్ష్యం ఏమిటి?"

"గొప్ప డాకర్ని కావటమే."

గోలులోకి బంతిని తన్నినట్టు విజయసూచకంగా చూశాడు డాక్టర్. వెంటనే వచ్చిన ఈ సమాధానానికి ఓడిపోయిన గోల్ కీపర్ లా ముఖం పెట్టాడు విశ్వం.

"ఇంకొక ప్రశ్న. ఈ పాతికేళ్ళలో నువ్వు చేసిన ఒక్క మంచిపని చెప్పు, చూద్దాం."

డాకర్ ఆలోచించసాగాడు. విశ్వం విజయసూచకంగా ముఖం పెట్టాడు.

"చెప్పలేవు. చూశావా, నీ ఇరవై అయిదేళ్ళ జీవితం స్వార్థంతో నిండిఉందన్నమాట. అందుకని, డాక్టరుగారూ, ఈ విషయం మనసులో ఉంచుకుని మీరు రోగులతో మెసలండి."

డాక్టర్ విశ్వం భుజంమీద చెయ్యేసి నవ్వుతూ "నువ్వు సంఘసేవకుడివనీ, సంఘోద్ధారకుడివనీ నాకింతవరకూ తెలీదే. ఒక్కసారైనా చెప్పావు కావేం?" అన్నాడు.

ఆ మాటలు వినగానే విశ్వం ముఖం ముకుళించింది. తను చేసిన సంఘసేవ ఏమిటి? ఇప్పటివరకూ శూన్యం. 'సంవత్సరం పొడుగునా సంఘసేవ చేస్తావులే' అని ఉగాదినాడు సూరి అన్న మాటలు గేలి చేస్తున్నట్టనిపించింది విశ్వానికి.

విశ్వం హైదరాబాద్ వచ్చి మూడు నాలుగు రోజులైంది. తోచనప్పుడు డిస్పెన్సరీకో, నర్సింగ్ హోమ్‌కో వెళ్ళి రోగుల్ని పరామర్శించి వస్తుండేవాడు. ఒకరోజు సాయంత్రం డిస్పెన్సరీనించి బరువుగా అడుగులు వేసుకుంటూ ఇంటికి వచ్చాడు. అతనదోవిధంగా ఉండటంచూసి పద్మ కారణం అడిగింది. ఏం లేదన్నాడు. ఏదో ఆలోచిస్తూ వాలుకుర్చీలో పడుకున్నాడు.

డాక్టరు మామూలుగా రాత్రిపూట ఎనిమిది కాగానే ఇంటికి వస్తాడు. ఆ రోజు రాత్రి ఎనిమిది దాటినా ఇంకా రాలేదు.

"నువ్వు భోజనానికి లే అన్నయ్యా. నీకు ఆలస్యమవుతోంది. వారు తరవాత భోజనంచేస్తారు." అంది ఆమె.

"ఆకలి లేదు లే" అన్నాడతను.

తొమ్మిది దాటింది.

"డాకర్ అప్పుడప్పుడు ఇంటికి ఆలస్యంగా వొచ్చేవాడా?"

"అవును. ఒక్కొక్కసారి పన్నెండుకూడా అవుతుంది."

"అప్పటివరకూ ఎక్కడుంటాడు."

"కొన్ని ప్రమాదపు కేసులుంటే అలాగే అక్కడే కూర్చుండిపోతారు."

"ఎవరు చెప్పారా సంగతి?"

"వారే"

"నిజమో కాదో కాంపౌండర్ని అడిగావా?" పద్మముఖం ఎర్రబారింది.

"నాకేంఖర్మం?" అంది.

"ఖర్మకనక నే!" అన్నాడతను.

"ఏమిటి నువ్వు మాట్లాడేది?"

"డాక్టర్ గారికి గడ్డిపువ్వుమీద మోజుకలిగిందిలే."

"అంటే?"

"నువ్వంటే శ్రీనివాసరావుకి నిజంగా ఇష్టమేనా?"

పద్మ కొంచెం సిగ్గుగా తలఊపింది.

"పద్మా, డాక్టర్ నువ్వనుకున్నంత మంచివాడు కాడు."

"చాల్లే. మళ్లీ అనకు అలాంటిమాట." అంది పద్మ కోపంగా.

"డిస్పెన్సరీలో అందరూ అనుకునేమాటే. ఆయనకి నర్సుతో సంబంధంఉంది. అందుకే ఆలస్యంగా రావటం."

"ఛీ." అంది పద్మ అసహ్యించుకుంటూ. "వెధవపుకారు. అలాంటివి నువ్వెలానమ్మావు?"

"పుకారయితే మంచిదేకాని దురదృష్టవశాత్తూ అది పుకారుకాదని నా నమ్మకం. ఆయన నర్సుతో కిలకిలనవ్వటం నేనుచూశాను."

"ఆయన అందరితో అలా మనస్ఫూర్తిగా నవ్వుతూనే మాట్లాడతారు. తాడూ బొంగరంలేని మాటలు వాళ్ళు చెప్తారు. నేను నమ్మను. ముమ్మాటికీ నమ్మను. నమ్మలేను."

ఆవేశంగా అంది పద్మ. కంట కన్నీరులికింది. ఆమెవైపు జాలిగా చూశాడు విశ్వం.

"నువ్వుదొరకటం డాక్టర్ అదృష్టం. అందంలో గాని, గుణంలోగాని, తెలివిలోగాని డాకర్ నీకు తీసికట్టు పద్మా. డాక్టర్ చెడ్డవాడని నాకు తెలుసు, నీకు తెలుసు, అందరికీ..."

పద్మముఖం జేవురించింది. ఆమె విశ్వం నోరు మూసింది.

"నీకేమీ తెలియదు. మనిషంటే మనసూ, మాటా హృదయమూ. అంతకంటే నాకేమీ మనిషినిగురించి తెలియదు. వారికంటె అందమైనవారు ఎవరూ లేరు."

ఈ మాటలు నెమ్మదిగా అతి సహజంగా ఏదో సత్యాన్ని చాటే విశ్వాసంతో అంది పద్మ.

విశ్వం మరేమీ మాట్లాడలేదు. ఇటువంటి పద్మని తనెరగడు. పద్మ అనే వ్యక్తి తనకి కనిపించటం

లేదు. ఏదో మూర్తి తేజస్సు విరజిమ్ముతూ సత్యం, శివం, సుందరం నిర్వచిస్తున్నట్టు అనుభూతి పొందాడు విశ్వం.

బయట ఉరుములు మెరుపులతో జోరుగా వర్షం కురుస్తోంది. రాత్రి పన్నెండు దాటింది. పద్మ, విశ్వం అలాగే తమ స్థానాల్లో ఉన్నారు. తలుపు చప్పుడయింది. పరిగెత్తివెళ్లి పద్మ తలుపుతీసింది. ఎదురుగా తడిసి ముద్దయి డాక్టరు నుంచున్నాడు.

"అబ్బ అకస్మాత్తుగా దారిలో కొట్టింది వాన. మైలుదూరం నడవాలి సొచ్చింది. సైకిల్ ట్యూబ్ పంచర్ పడ్డది" అంటూ లోపలికొచ్చి విశ్వాన్ని చూశాడు.

"అరే, అదేమిటోయ్, ఇంకా అలాగే నిద్ర పోకుండా కూర్చున్నావేం?"

"నీకోసమే" అన్నాడు విశ్వం.

"భేష్. గొప్పవాడివే డాక్టర్ కోసం కనిపెట్టుకుని కూర్చుంటే బాగుపడ్డట్టే."

విశ్వం నవ్వు తెచ్చుకొన్నాడు. డాక్టర్ బట్టలు మార్చి పొడిబట్టలు వేసుకున్నాడు. ఆయన హుషార్‌గానే మాట్లాడుతున్నా విశ్వం మాత్రం ముభావంగానే ఉన్నాడు.

"మృత్యువుతో పోట్లాట అనుకో. ఏమవుతుందో పాపం. భయం లేదనుకుంటాను." తనలో అనుకున్నట్టుగా గొణిగాడు డాక్టర్.

"ఎవరి సంగతి?"

"ఎవరో కూలివాడు, పాపం. మందు కొనటానికి కూడా లేనివాడు. వాడిమీద కుటుంబం అంతా ఆధారపడి ఉంది. చిన్నపిల్లలు."

విశ్వం కొంచెం అపనమ్మకంగా చూశాడు డాక్టర్ వైపు. "చూశావా?" అన్నట్టు పద్మ ధీమాగా విశ్వంవైపు చూసింది.

తెల్లవారింది. రాత్రి వానలో తడవటంవల్ల డాక్టర్‌కి కాక తగిలింది. అయినా సరకు చెయ్యక డిస్పెన్సరీకి బయలుదేరబోతున్నాడు. ఇంతలో ఎవరో ఒక పేద స్త్రీ వచ్చి, డాక్టర్ కాళ్లకి నమస్కారం చేసి భట్రాజు కీర్తనలు చెయ్యటం మొదలుపెట్టింది. దేవుడల్లే అడ్డుపడి తన భర్త ప్రాణం దక్కించినందుకు డాక్టర్ని ఆమె అనర్గళంగా దీవించసాగింది. మరొక డాక్టరయితే ఆలారోగి దగ్గర పడిగాపులుపడి ఉండి ప్రాణం దక్కించటానికి శ్రమపడడని, ఆయన ఋణం ఈ జన్మకి తీర్చుకోలేననీ స్తుతించింది. "అంతా అదృష్టం" అని డాక్టర్ ఆమెని పంపించివేశాడు.

విశ్వం పద్మవంక చూశాడు. ఆమె చిరునవ్వు నవ్వుతోంది. అతనుకూడా నవ్వాడు. "ఏమిటి కథ?" అన్నాడు డాక్టర్ అది చూసి. "తరవాత చెబుతా లే" అన్నాడు విశ్వం.

కొద్దిలో పోతుందనుకున్న జ్వరం సులభంగా వొదల్లేదు డాక్టర్‌కి. ఇన్‌ఫ్లుయెంజాలోకి దింపింది. పద్మ రాత్రింబగళ్లు సేవ చేస్తోంది. విశ్వం కూడా మంచం దగ్గిరే ఉండి కబుర్లు చెబుతున్నాడు.

ఆ సాయంత్రం ఏవో మందులుకొని తీసుకురావటానికి విశ్వం బయల్దేరాడు. బజారుకి వెళ్ళటానికి డిస్పెన్సరీ మీదగా వెళ్లాలి. డిస్పెన్సరీ ఉన్న పేటంతా ఎక్కువగా కూలి నాలి చేసుకుని బతికే జనం నివసించే ప్రదేశం. విశ్వం నడుస్తుంటే డప్పులచప్పుళ్లు వినిపించాయి. జనం చాలామంది గుమిగూడారు. అదేమిటో చూద్దామని అక్కడికి వెళ్లాడతను. అమ్మవారికి జాతర జరుగుతోంది.

"ఏమిటి ఊళ్ళో బాగుండలేదా?" అనడిగాడు విశ్వం గుంపులో ఒకణ్ణి.

"కాదు బాబూ, డాక్టర్ బాబుగారికి ఒంట్లో సరిలేదుగదండి. జాతర చేస్తే తగ్గుద్దని మా వోళ్ళంతా చేస్తున్నాం."

విశ్వం అప్రతిభుడయాడు.

"ఏ డాక్టర్? శ్రీనివాసరావుగారేనా?"

"చిత్తం. ధరమరాజు. మా లేనోళ్ళకి దిక్కు. పానంపోసే దొర. ఆయన తల్లి కడుపు చల్లగా నూరేళ్లు బతకుండాలి."

గుంపులో కలిసిపోయాడతను. విశ్వం కళ్లు చెమ్మగిలాయి. ఒక్క మంచిపని చెయ్యమని డాక్టర్‌కి తను సలహా ఇచ్చాడు!

విశ్వం ఇంటికి వచ్చేసరికి చీకటి పడింది. అప్పుడే పద్మ థర్మామీటరు చూస్తూ "అమ్మయ్య," అంది. డాక్టర్ ఆమె వైపు చిరునవ్వుతో ప్రేమగా చూశాడు.

ఆ సమయంలోనే విశ్వం గదిలో అడుగుపెట్టాడు. ఆదృశ్యం చూసి మురిసిపోయాడు. "నిన్నేదో మంచిపని చెయ్యమని సలహా ఇచ్చాను. అదిఉపసంహరించుకుంటున్నాను డాక్టర్" అన్నాడు విశ్వం.

డాక్టర్ ముసి ముసిగా నవ్వాడు.

పద్మకిదేమీ అర్థం కాక విశ్వం వైపు అయోమయంగా చూసింది.